క్లుప్తంగా

లేబర్ కోడ్ రద్దు చేసే వరకు పోరాటం



జీపుజాతాలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్

పామూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కోడ్ చట్టాలు రద్దు చేసేంత వరకు కార్మికులంతా ఐక్యంగా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ అన్నారు. లేబర్‌కోడ్ రద్దుకై ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం పామూరు సుందరయ్యభవన్ సెంటర్‌లో జీపుజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మట్లాడుతూ కార్మికులకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలన్నారు. సీఐటీయూ జిల్లా నాయకుడు సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ అధికారంలోకి రాగానే నాలుగు నల్ల చట్టాలు తెచ్చారని, వాటిని రద్దు చేసే వరకు రైతులు ఉద్యమించాలన్నారు. 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

సింగరాయకొండ: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం సీఐటీయూ నాయకులు మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్మికులకు వ్యతిరేకమైన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, అన్ని రంగాల కార్మికులకు కార్మిక, సంక్షేమ చట్టాలు అమలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీనివాసులు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా దత్తాత్రేయస్వామి తిరునాళ్ల



స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

మర్రిపూడి: మండలంలోని జువ్విగుంటలో మొగలిపూరి దత్తాత్రేయస్వామి 17వ వార్షికోత్సవం సందర్భంగా తిరుణాళ్లను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూజారి గట్టుపల్లి కృష్ణమోహన్ శాస్త్రి ఆధ్వర్యంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామస్తుల సహకారంతో ఆలయ ఆవరణంలో లక్ష్మీ నృసింహస్వామి, దత్తాత్రేయస్వాముల కల్యాణాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం కనులపండువగా సాగింది. భక్తుల అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

కుక్కలకు టీకాలు



పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న పశువైద్యులు హజరత్

సింగరాయకొండ: పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని ప్రభుత్వ పశువైద్యాధికారి హజరత్ అన్నారు. మండల కేంద్రంలోని పశువైద్యశాలలో ఆదివారం ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా కుక్కలకు టీకాల కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ హజరత్ మాట్లాడుతూ టీకాల ద్వారా కుక్కలు, పిల్లుల నుంచి సంక్రమించే ప్రాణాంతక వ్యాధులను అరికట్టవచ్చన్నారు. కుక్కలు, పిల్లలకు రేబిస్ వ్యాక్సిన్‌తో పాటు నులిపురుగుల మందులు తప్పనిసరిగా వాడాలని సూచించారు. 76 పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో బంగారు భవిష్యత్



ఐశ్వర్యను అభినందిస్తున్న డాక్టర్ వెంకయ్య, బొడ్డు వెంకటేశ్వరరావు

టంగుటూరు: పోటీ ప్రపంచంలో క్రమశిక్షణతో కష్టపడితే బంగారు భవిష్యత్ అందిపుచ్చుకోవచ్చని ఆదాయ పన్ను శాఖ డిప్యూటీ కమిషనర్, స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవ సలహాదారుడు బొడ్డు వెంకటేశ్వరరావు అన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి షైనింగ్ స్టార్ అవార్డు సాధించి ట్రిబుల్ ఐటీ కళాశాలలో సీటు సాధించిన మేడికొండ ఐశ్వర్యను టంగుటూరులోని కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలి పనులు చేసుకుంటూ జీవించే నిరుపేద కుటుంబం నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉత్తమ ఫలితాలు సాధించడం అసాధారణమన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఐశ్వర్యను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం ఐశ్వర్యను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ పీడీసీసీబీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, సంస్థ అధ్యక్షుడు బొడ్డు గ్లోరీ జరుగుమల్లి గ్రామస్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాగునీటికి తప్పని తంటాలు

- మరమ్మతులకు నోసుకోని సాగర్ జలాల పంపింగ్ మోటార్లు
- నిరుపయోగంగా సంపులు, ఓహెచ్ ట్యాంకులు
- తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తుల ఆవేదన
- మోటార్లు మరమ్మతుల గురించి పట్టించుకోని పాలకులు, అధికారులు

హనుమంతునిపాడు:

మండలంలో పలు గ్రామాల్లో తాగునీటి ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఏడాది కాలంగా సాగర్ నీరు అందకపోవడంతో తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు చందవరం ప్రాజెక్టు నుంచి మండలానికి సరఫరా అయ్యే నీటిని సక్రమంగా అందించడం లేదు. కొండ శివార గ్రామాలకు నీరు అందక తాగు నీటికి తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. మండలంలో 20 వరకు ఓవర్ హెడ్ ట్యాంకులు, మినీ ట్యాంకులు ఏర్పాటు చేశారు. నీటిని పైప్‌లైన్ల ద్వారా కొండ శివారు గ్రామాలకు ఎక్కించేందుకు కూటాగుండ్ల, వాలిచర్ల, నందనవనం, హాజీపురం అడ్డరోడ్డులో మోటార్లు, సంప్‌లు, ట్యాంక్‌లు ఏర్పాటు చేశారు. కూటాగుండ్ల, వాలిచర్ల, నందనవనం వద్ద సంప్ మోటార్లు కాలిపోయాయి. అయినా మరమ్మతులు నోచుకోలేదు. చందవరం ప్రాజెక్టు నుంచి వచ్చే సాగర్ జలాలు హాజీపురం, హనుమంతునిపాడు దాటి పై గ్రామాలకు చుక్క నీరు సరఫరా కావడం లేదు. దాసరిపల్లి, కొండారెడ్డిపల్లి, హాజీపురం అడ్డరోడ్డు వరకు పైపు లైన్లు మొత్తం లీకులమయమై వాటి మరమ్మతుల గురించి పట్టించుకునే వారే కరువయ్యారు.



వాలిచర్లలో నిరుపయోగంగా ఓవర్‌హెడ్ ట్యాంకు

పైప్‌లైన్ల లీకులతో నీరు వృథా

మెయిన్ పైప్‌లైన్లు లీకులతో సాగర్ జలాలు వృథాగా పోతున్నాయి. వాటి మరమ్మతుల గురించి పట్టించుకోవడం లేదు. దీంతో నీటి ఇబ్బందులు ప్రజలు బబుల్ వాటర్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఏడాది కాలంగా

ఏడాది కాలం నుంచి వీరరాంపురం గ్రామంలోని ఎస్సీ కాలనీకి సాగర్ తాగునీరు సరఫరా కావడం లేదు. గ్రామంలో నుంచి సాగర్ జలాలు పైపులైన్ ఉంది. అయినా ఎస్సీ కాలనీకి చుక్క నీరు అందించరు. కాలనీలోని మినీ ట్యాంక్‌లు కూడా నిరుపయోగంగా ఉన్నాయి. కాలనీలో ఉన్న చేతి పంప్‌లు కూడా మరమ్మతులకు గురయ్యాయి. దీంతో నీటికి కాలనీవాసులు పడే అవస్థలు చెప్పేవీ కావు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తాగునీటి ఇక్కట్లు తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.



తిమ్మారెడ్డిపల్లి పంచాయతీ ఆవులవారిపల్లిలో మూలనపడ్డ ట్యాంక్

కాలిపోయిన మోటార్లు..

కూటాగుండ్ల, వాలిచర్ల, నందనవనం వద్ద మోటార్లు కాలిపోయాయి. కానీ ఎవ్వరూ పట్టించుకోవడంతో కూటాగుండ్ల, దాసళ్లపల్లి, ముప్పళ్లపాడు, రామాయిపల్లి , విరగారెడ్డిపల్లి వరకు సాగర్ జలాల సరఫరా నిలిచిపోయింది. తప్పనిపరిస్థితుల్లో గ్రామస్తులు బోర్ల నుంచి వచ్చే ఫ్లోరైడ్ నీరు తాగి వ్యాధుల బారిన పడుతున్నారు. నందిరెడ్డిపల్లి, అప్పలరెడ్డిపల్లి, గురవారెడ్డి గ్రామాలకు సాగర్ జలాలు అందడం లేదు. సంపులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. నందనవనం వద్ద మోటార్ల మరమ్మతులతో నంప్ నందనవనం సంప్ నుంచి వీరరాంపురం, నందనవనం, పాపిరెడ్డిపల్లి, గమ్ముల్లపాలెం, మంగంపల్లి గ్రామాలకు సరపరా అయ్యే నీరు నిలిచిపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.



మూలన పడ్డ పంపింగ్ మోటార్లు

నిరుపయోగంగా సంపులు, ట్యాంకులు



వాలిచర్లలో నిరుపయోగంగా సంప్

సాగర్ జలాలు నింపక గ్రామాల్లో ఏర్పాటు చేసిన సంప్‌లు పిచ్చిచెట్లు మొలిచి నిరుపయోగంగా దర్శనిస్తున్నాయి. ట్యాంకులకు కూడా నీరు ఎక్కకపోవడంతో ఏడాది కాలంగా గ్రామాల్లో నిరుపయోగంగా మారాయి.

ఘనంగా మొహర్రం వేడుకలు



తెల్లగుర్రం పై జలధికి తరలుతున్న అక్బర్ అలీ



హాజీపురంలో పీర్లకు పూజలు

- భక్తి పారవశ్యమైన కనిగిరి
- భారీగా హాజరైన ప్రజలు

కనిగిరిరూరల్: మొహర్రం వేడుకలు ఆదివారం రాత్రి షహదత్ నామా అల్‌విదాతో ముగిశాయి. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత పెదషరిగత్తు వేడుకలతో ప్రారంభమై, పీర్ల గ్రామోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. వివిధ మకాన్‌లకు చెందిన అక్బర్ అలీ, పాదిలి సాహెబ్, ఇమామే హుస్సేన్, బారాయిమామ్, గిద్దలూరు సాహెబ్, ఇమామేఖాశిం తదితర నామకరణాలు కలిగిన పీర్ల (హజరత్)ను సుందరంగా తీర్చిదిద్ది పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. పీర్ల చావిడి వద్ద శనివారం వేకువజామున జరిగిన పీర్ల అగ్నిగుండ ప్రవేశాన్ని వీక్షించేందుకు ప్రజలు తండోపతండాలుగా వచ్చారు. భక్తులు హజరత్‌లను (పీర్లను) దర్శించుకుని భక్తి పారవశ్యమయ్యారు. వివిధ మకాన్‌లకు చెందిన వివిధ నామకరణాలు కల్గిన పీర్లు పాతూరు సెంటర్, బొడ్డుచావిడి సెంటర్, పామూరు బస్టాండ్ సెంటర్ లలో ‹సలాములు› అందుకున్నారు. సలాముల మహోత్సవాన్ని తిలకించేందుకు వేకువ జామున మహిళలు అధిక సంఖ్యలో వచ్చారు. తిరిగి మధ్యాహ్నం ఆయా మకాన్‌ల వద్దకు పీర్లు వెళ్లాయి. అనంతరం సయ్యద్ మకాన్‌వద్ద మొక్కుబడులు తీర్చుకునే కార్యక్రమం ఎంతో నిష్టగా జరిగింది.

శ్వేత గుర్రంపై జలధికి తరలిన అక్బర్‌అలీ పీరు

పీర్లు బావికి(జలధి) వెళ్లే కార్యక్రమం ఆదివారం రాత్రి అత్యంత నియమనిష్టలతో చేశారు. కామ్రేడ్ సయ్యద్ హనీఫ్ ఇంటి వద్ద నుంచి తెల్లని గుర్రంను ఎంతో నియమ నిష్టలతో సయ్యద్‌వారి పీర్ల చావిడికి అందచేశారు. అనంతరం శ్వేత గుర్రంపై అక్బర్‌వలి, ఇమామే హసన్, ఇమామే హుస్సేన్ పీర్లను కొలువు తీర్చి.. మహిళా నాదస్వర సన్నాయి మేళాలతో పీర్లను జలధి కార్యక్రమానికి తరలించారు. అనంతరం ముజావర్లు అల్‌విదాయో ..అల్‌విదాషా.. ఏ హుస్సేనీ.. అల్‌విదా..అంటూ బాధాప్త గేయాలను ఆలపిస్తూ పీర్లను తిరిగి చావిడికి తీసుకుని వెళ్లడంతో మొహర్రం ముగిసింది. డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ ఎస్సై ఖాజావలి ఆధ్వర్యంలో ఎస్సై టి.శ్రీరాం భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. మయాన మకానం, సయ్యద్ మాకనం వద్ద మొక్కుబడులకు వచ్చిన వారికి భారీగా అన్నదానం ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కోఆప్షన్ సభ్యులు చింతం శ్రీనివాసులు అన్నదానానికి ఆర్థిక సహకారం అందచేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కౌన్సిలర్ సయ్యద్ రిజ్వానా ఖాలక్, డాక్టర్ పెరుగు మురళీకృష్ణా, మాజీ కౌన్సిలర్లు సయ్యద్‌నాయబ్ రసూల్, పఠాన్ ఖాదర్ ఖాన్, సయ్యద్ జిలానీ, మాజీ ఏఎంసీ డైరక్టర్ బొట్టు శ్రీను, టీడీపీ నాయకుడు గుడిపాటి ఖాదర్, వివిధ పార్టీల నాయకులు, ముజావర్లు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండలంలోని హాజీపురం, నందనవనం, మహ్మదాపురంగ్రామాల్లో మొహర్రం వేడుకల్లో భాగంగా సరిగత్తు వేడుకలు వైభవంగా నిర్వహించారు. పీర్ల చావిడీలో పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం పీర్లను ఎత్తుకోని గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయాల్లో దద్దాల ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల, నాయకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని తిమ్మరాజుపాలెంలో గ్రామదేవతలు చౌడేశ్వరీదేవి, పోలేరమ్మతల్లి ఆలయాల్లో ఆదివారం వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం పెదరాజుపాలెంలో చర్చి నిర్మాణానికి రూ.లక్ష విరాళం ఇచ్చి నిర్మాణంలో ఉన్న చర్చి పనులను పరిశీలించి త్వరితగతిన చర్చి నిర్మాణం పూర్తిచేయాలని వారికి సూచించారు. ఈసందర్భంగా ముందుగా ఆలయ కమిటీ దద్దాలను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ పందిళ్ల నాగమణిఎల్లయ్య, బైరెడ్డి తిరుపతిరెడ్డి, టీయూసీ జిల్లా అధ్యక్షుడు మితికాల గురవయ్య, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బి.వెంకటయ్య, పి.భాస్కర్‌రెడ్డి, మన్నేపల్లి పెద్దన్న, బత్తుల దేవరాజ్, జి.ఆదినారాయణరెడ్డి, బాస్కర్‌రెడ్డి, టి.శివరామిరెడ్డి, ముప్పాళ్ల వసంతరాజు, మేడబోయిన అటేలయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎస్సై మహేంద్ర, దాతలు

సింగరాయకొండ: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై బి.మహేంద్ర విజ్ఞప్తి చేశారు. స్థానిక శ్రీరాంనగర్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహకారంతో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పాఠశాలకు బీరువాలు, కుర్చీలు అందజేశారు.దాతలు తన్నీరు రమణయ్య, తన్నీరు వెంకయ్య, తన్నీరు సుబ్బారావు, తన్నీరు వెంకటేశ్వర్లు, తన్నీరు రాజు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, వేణు, కుంచాల ఏడుకొండలు, తన్నీరు నాగేంద్రబాబులను ఎస్సై అభినందించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ప్రధానోపాధ్యాయుడు పి.సునందగ్రేస్, ఉపాధ్యాయుడు ఎం ప్రభాకరరెడ్డిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయులు ఎన్ కొండయ్య, బి.రమాదేవి, పి.దీనాకుమారి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ఏర్పాటు అభినందనీయం

సీఎస్‌పురం(పామూరు): ప్రయాణికుల సౌకర్యార్థం దాతలు బస్‌షెల్టర్ నిర్మించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. మండలంలోని తిమ్మరాజుపాలెంలో దనెంకుల వెంకటయ్య, వెంకటమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు నిర్మించిన బస్‌షెల్టర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ పందిళ్ల నాగమణి, బైరెడ్డి తిరుపతిరెడ్డి, పార్టీ టీయూసీ జిల్లా అధ్యక్షుడు మితికాల గురవయ్య, భువనగిరి వెంకటయ్య, మర్రి రామయ్య, పల్నాటి భాస్కర్‌రెడ్డి, మన్నేపల్లి పెద్దన్న, బత్తుల దేవరాజు, దుద్దుకూరి శ్రీనివాసులు, ఆదినారాయణరెడ్డి, పల్నాటి భాస్కర్‌రెడ్డి, తమ్మినేని శివరామిరెడ్డి, ఎం వసంతరాజు, యం.అటేలయ్య, పులిమి ఆదినారాయణ, ఆర్.నాగరాజు, దాతలు వెంకటయ్య, రమణయ్య, చెంచయ్య, బసవయ్య, రాధాకృష్ణ, మల్లికార్జున, దనెంకుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



దాతలు నిర్మించిన బస్ షెల్టర్‌ను ప్రారంబిస్తున్న ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల, నాయకులు

దద్దాలను సన్మానించిన నేతలు



దద్దాలను సన్మానిస్తున్న నూతన కమిటీ

కనిగిరిరూరల్: క్షేత్ర స్థాయిలో పార్టీ పటిష్టతకు అందరం సమష్టిగా పనిచేద్దాం అని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల పార్టీ కమిటీలో నియమితులైన ముద్దా బాబు, సంగు వెంకటేశ్వరరెడ్డిలు దద్దాల నారాయణను ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన కమిటీని దద్దాల సన్మానించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు ఆవుల భాస్కర్‌రెడ్డి, జిల్లా నాయకులు మూలే గోపాల్‌రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, గుత్తికంటి విజయ్ పాల్, ఆవుల అంకిరెడ్డి, భీమిరెడ్డి వెంకటేశ్వర్లు, ముద్ద ఎబినేజర్, వంగేపురం మార్క్ తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రాంకు ఘన నివాళి



సింగరాయకొండ: జగ్జీవన్‌రాం వర్ధంతిలో పాల్గొన్న నాయకులు

సింగరాయకొండ: మాజీ ఉప రాష్ట్రపతి బాబు జగ్జీవన్ రాం వర్ధంతిని స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ కట్టా శోభారాణి, పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ రీజినల్ కో ఆర్డినేటర్ రాపూరి ప్రభావతి, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ జనరల్ సెక్రటరీ చొప్పర వెంకన్న, రాష్ట్ర ముస్లిం మైనారిటీ జాయింట్ సెక్రటరీ పఠాన్‌రియాజ్, రాష్ట్ర ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి కె.నరేంద్రరెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక శాఖ జాయింట్ సెక్రటరీ షేక్ మహమ్మద్ భాషా, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సుల్తాన్, జిల్లా నాయకులు పాడిబండ్ల కోటేశ్వరరావు, పాలూరి శ్రీనివాసులరెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యనమల మాధవి ఇతర నాయకులు పాల్గొన్నారు.



టంగుటూరులో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

టంగుటూరు: స్థానిక బొమ్మల సెంటర్లో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని ఘన నివాళి అర్పించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ కొండపి ఏఎంసీ డైరెక్టర్ కొమ్ము సురేంద్ర, దేవరపల్లి వరుణ్, కసుకుర్తి నవీన్, సుమన్, కిరన్, పందిటి అశోక్‌బాబు, పేరూరి కమలాకర్, కొమ్ము కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యదేవుని సామూహిక వ్రతాలు

పామూరు: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక రమా సమేత వీరవెంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం రమాసమేత సత్యనారాణస్వామి మూల విగ్రహాలకు పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమపూజ, విశిష్ట పూజలు చేశారు. అనంతరం 124 దంపతులతో అర్చకులు చిమట కార్తీక్, కృష్ణసాయిలు వేదమంత్రాలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహింపజేశారు. మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ దరిశి రాము, వాసవీమాత ఆలయ మాజీ చైర్మన్ యేల్చూరి బాలకొండలరావు, సత్యనారాయణస్వామి ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.



విశిష్ట అలంకరణలో సత్యనారాయణస్వామి మూల విగ్రహమూర్తి



సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు



సింగరాయకొండ కోదండరామస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు



సీఎస్‌పురం: విశిష్ట అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథస్వామి

సింగరాయకొండ: మండలంలో తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని కోదండరామస్వామి దేవస్థానంలో ఆదివారం మూలవిరాట్‌కు 1,108 బిందెలతో జలాభిషేకం, పంచామృతాభిషేకం, విష్ణుసహస్రనామ, భగవద్గీత పారాయణం చేసి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పురాతన ఆలయం అయ్యలూరివారిపల్లెలోని శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా విశిష్ట పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి అర్చకులు రామమూర్తి వేకువజామున అభిషేకం చేశారు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు కుంకుమపూజ నిర్వహించారు.



పీసీపల్లిలో ప్రత్యేక పూజలు

పీసీపల్లి: మండల పరిధిలోని పెదయిర్లపాడు మల్లేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. 1111 శివలింగాలకు పాలాభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ, అభిషేకం



గోపూజలో పాల్గొన్న భక్తులు



మహానైవేద్యంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, అనంతరం స్వామికి అభిషేకం అర్చకుల వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ పంచామృతాలతో స్వామి ఉత్సవమూర్తికి అభిషేకం చేశారు. అదేవిధంగా గోశాలలో గోపూజ నిర్వహించారు. అనంతరం మహానైవేద్యంతో ఆలయ ప్రదక్షిణ చేసి స్వామికి సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మనేని చిన్న ఆదినారాయణ, ఈట శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు పాల్గొన్నారు.